క్లుప్తంగా

బల్క్ ఎస్‌ఎంఎస్‌లు నిషేధం: కలెక్టర్

నారాయణపేట: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బల్క్ ఎస్‌ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని, ఎవరూ అలాంటి మెసేజ్‌లు పంపవద్దని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో ఎవరు రాజకీయపరమైన ఎస్‌ఎంఎస్‌లు, ఎలాంటి అభ్యంతకరమైన బల్క్ ఎస్‌ఎంఎస్‌లను పంపకూడదని తెలిపారు. ఎవరైనా వీటిని ఉల్లంఘిస్తే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా ఎస్ఎంఎస్‌లను పంపడానికి అయ్యే ఖర్చులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ సమయం గంట పెంపు

మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందుకు ఎన్నికల కమిషన్ ఆర్.పి యాక్ట్ 1951 అనుసరించి పోలింగ్ వ్యవధిని సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు పొడిగిస్తూ మెమో నెంబర్ 11301 తేది 1-5-2024 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఓటరు తనకు ఇచ్చిన ఓటరు స్లిప్పుతో పాటు ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పకుండా వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఓటరు స్లిప్‌తో పాటు ఎపిక్ కార్డు లేదా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు లేదా పోస్టాఫీసు పాస్ బుక్, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, ఆర్.జీ. ఐ ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ ఖాతా బుక్కు, సర్వీస్ గుర్తింపు కార్డులో ఒక కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు.

జనజాతరకు తరలిన నాయకులు

నర్వ: మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సాయంత్రం నిర్వహిస్తున్న జనజాతర సభకు మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఇన్‌చార్జి పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, నీరజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బల్‌రాంగౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



నర్వ: ప్రధాని మోదీ సభకు శుక్రవారం మండలం నుంచి భారీగా బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. కుర్వసత్యం, రవికుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, కృష్ణయ్య, ఆయా గ్రామాల నాయకులున్నారు.

దామరగిద్ద: బీజేపీ జనసభకు మోదీ హాజరు కావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన జనసభకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక వాహనాల్లో మహిళలు, చిన్నారులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరికల్: ప్రధాని మోదీ జనసభకు శుక్రవారం మండలం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. అలాగే పెద్దచింతకుంటలో చిన్నారులు, పెద్దలు మోదీ చిత్రపటాలను ముఖాలకు పెట్టుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

దుస్తుల పంపిణీ



ధన్వాడ: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు శుక్రవారం కెంచె యాదయ్య, కుసుమమ్మ దంపతులు దుస్తులను పంపిణీ చేశారు. వారి కుమారుడు కేశే. నర్సింహారాజ్ జ్ఞాపకార్థంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు పంపిణీ చేశారు. రఘురాజ్, భాను, వెంకటయ్య, నర్సింహులు, లక్ష్మీ, విరేష్, యూసుఫ్, పెంటప్ప ఉన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌ను తొలగించాలి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో టీచర్ల పదోన్నతుల సంక్షోభం, టెట్ వివాద పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ కమిషనర్‌ను వెంటనే ఆ పదవీలో నుంచి తొలగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్ నుంచి అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రమోషన్ల ప్రక్రియపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. అదేవిధంగా టెట్‌పై టీచర్లలో నెలకొన్న సమస్యను తొలగించి సవరణలపై వివరణ తీసుకోవాలని పలు మార్లు విజ్ఞప్తులు చేస్తున్న పట్టించుకోవడం లేదని వాపోయారు.

బసవేశ్వరుడు ఆదర్శప్రాయుడు



నారాయణ పేటలో పతాకావిష్కరణ చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు



వేడుకల్లో బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి, వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్

నారాయణపేట రూరల్: మహాత్మా బసవేశ్వరుడు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని జిల్లా బీసీ సంక్షేమ అధికారి కృష్ణమాచారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. బసవ జయంతిని పురస్కరించుకొని బీసీ సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం అధికారికంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బసవేశ్వరుడు నాటి కాలం నుంచే కుల, మత బేధాలను దూరం చేయాలనే సంకల్పంతో ముందుకు కదిలాడని, ఆయన వచనాలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్-లింగబలిజ సంఘం నాయకులు ఆవుటి రవికుమార్, మల్లికార్జున్, గందె రవికాంత్, శంకర్‌బాబు, రవికుమార్, మంగళ్గి సచిన్, లిఖిరఘుబాబు, సురేష్ పాల్గొన్నారు.

పట్టణంలోని..

సరాఫ్‌బజార్ బసవేశ్వర ఆలయంలో శుక్రవారం బసవ జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో ధ్వజారోహణం చేశారు. సాయంత్రం ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా పెద్ద ఎత్తున ఎద్దుల జతలతో ఊరేగింపు నిర్వహించగా, కాడెద్దులపై బసవేశ్వరుడి చిత్రపటం ఉంచి శోభాయాత్ర చేపట్టారు. అయా కార్యక్రమాల్లో అర్చకులు మంజునాథ్ స్వామి, విశ్వనాథ్, మహిళలు పాల్గొన్నారు. .

శివలింగేశ్వర ఆలయంలో..

వీరశైవ లింగాయత్ – లింగబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుటి రవికుమార్ ఆధ్వర్యంలో శివలింగేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మాగనూర్: మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్ రోడ్డు వద్ద వీరశైవలింగాయత్ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, శ్రీ సిద్ధలింగమహాస్వామి హాజరై మాట్లాడారు.. నాయకులు ఆనంద్‌గౌడ్, ఎల్లారెడ్డి, రాజుల ఆశిరెడ్డి, వాకిటి శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: సమాజ ఉన్నతికి కృషిచేసిన గొప్ప మానవతావాది బసవేశ్వరుడని మండల వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం నాయకులు బస్వంత్‌రాజ్ శంభులింగం, గురులింగప్ప మహేష్, సతీష్ అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం, బసవేశ్వర ఆలయంలో బసవేశ్వర చిత్రపటానికి పూజలు చేశారు.

కృష్ణా: సమసమాజాన్ని నిర్మించి అందరికి ఆదర్శప్రాయుడయ్యాడని నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగమహాస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని హిందుపూర్‌లో బసవేశ్వర విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డితో కలిసి పూజలు చేశారు. అలాగే హిందుపూర్‌లోని మహాత్మ బసవేశ్వరుడి విగ్రహానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. అఖిల పక్షాల నాయకులు, వీరశైవులు, కాంగ్రెస్ నాయకులు సిద్ధార్థరెడ్డి, రాజప్పగౌడ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని మండల వీరశైవలింగాయత్ సమాజం ఆధ్వర్యంలో శివాలయంలో స్వామివారి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, వీరశైవలింగాయత్‌లు జగదీశ్వర్, మల్లికార్జున్, సతీష్, శివకుమార్, రాజు, మహేష్, సిద్దిరామయ్య పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని వీరశైవ సమాజంలో ఆధ్వర్యంలో శుక్రవారం బసవేశ్వర జయంతిని వైభవంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. బాల్‌రెడ్డి, బసవరాజు, సం ఘం సభ్యులు నీల్‌రాజు, సురేష్‌లింగం, జగదీష్, ఎల్కోటి లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మరికల్: మండల వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వైభవంగా బసవ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. అలాగే మండల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో బసవ జయంతిని అధికారులు నిర్వహించారు. జగదీష్, టైలర్ వీరన్న, బసంత్, మల్లికార్జున్, శివ, శరణప్ప, సోమనాథ్, బసన్న పాల్గొన్నారు.



కృష్ణాలో ..



మద్దూరులో..



దామరగిద్దలో..



మరికల్‌లో..

మక్తల్‌పై సీఎం ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మక్తల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించాలని వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. సంగంబండ భీమా ప్రాజెక్టు కింద బండ తొలగించకపోవడంతో 9 గ్రామాలకు సాగునీరు అందడం లేదని, బాధితులు తన దృష్టికి తేవడంతో వెంటనే ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో.. అధికారులతో మాట్లాడి రూ.12 కోట్లు మంజూరు చేశారన్నారు. మక్తల్-పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం 69 జీఓ నంబర్ నుంచి కృష్ణానది నుంచి సాగునీరు అందించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు 9న జీతాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి సీఎం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. గద్వాల, పేట జెడ్పీచైర్‌పర్సన్లు సరిత, వనజ, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యు డు లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ బాలకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రవికుమార్‌యాదవ్, జలంధర్ రెడ్డి, దేవరి మల్లప్ప, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పలువురి చేరిక..

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో బీఆర్ఎస్ మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ రాజేశ్వర్‌రావు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారిని ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే మాద్వార్ నుంచి మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ సవరప్ప, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, అరికెరి సవరప్ప, పీఏసీఎస్ డైరెక్టర్ ఘనపురం వెంకటప్ప కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్‌డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, కె.శ్రీహరి, లక్ష్మణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులతోపాటు పది బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వార్డు సభ్యులు జంగడి మంజుల, గొల్ల విజయ్‌తో ఇతరులకు కుంభం శివకుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సూర్యమోహన్, వీరన్న, కృష్ణయ్య, వినితమ్మ, రామకృష్ణ, హరీష్, చెన్నయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



మరికల్‌లో..

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



కొటకొండలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌రాం ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కోటకొండలో హస్తం గుర్తుకు ఓటువేయాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. ప్రజాస్వామ్యం రక్షణ కోసం నరేంద్ర మోదీని ఓడించి, కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బాలప్ప, దస్తప్ప, కాశప్ప బాలకృష్ణ మల్లేష్ గోవిందుబాయ్, కాశప్ప పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని కొత్తపల్లి, చెన్నారెడ్డిపల్లి, మద్దూరు, పల్లెర్ల, భూనీడ్, మోమినాపూర్, నిడ్జింత తదితర గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లి ఎంపీటీసీ అనిత చెన్నప్ప ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కాంగ్రెస్ పథకాల గురించి వివరించారు. అలాగే కొత్తపల్లి చెందిన బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్చారు.

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, భరత్‌కుమార్, నరేష్, బాలు, వెంకటయ్య, ఆంజనేయులు, నర్సింహులు, శంకర్ పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



మరికల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



ఊట్కూరులో..

మరికల్: మండల కేంద్రంలో శుక్రవారం కొనసాగుతన్న ఉపాధి పనుల వద్ద బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామస్వామి, బసంత్, కృష్ణయ్య, మొగులప్ప, శ్రీనివాస్, రవి, మాసప్ప, వెంకటన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈమేరకు.. మేన్‌బజార్, శరత్‌నగర్, శివాజినగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ అశోక్‌కుమార్, నాయకులు ఆనంద్, శివారెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదామని మండల బీఆర్ఎస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు సుభాష్, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, భీమయ్యగౌడ్, అన్నారు. శుక్రవారం మండలంలోని దామరగిద్ద, అయ్యవారిపల్లి, కాన్‌కుర్తి తదితర అన్ని గ్రామ బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు వెంకటయ్య, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో..

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు నీటిని అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మస్తీపురం, ధర్మపురం, నాగల్‌కడ్మూర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్లతో పాటు వాటర్ ట్యాంకర్లను అందించిందన్నారు. మొక్కల సంరక్షణ కోసం ఉపాధి హామీ పథకం ద్వార వాచర్లను నియమించి రోజువారీగా ఉదయం, సాయంత్రం నీటిని అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌స్టేషన్ల నిర్వహణ, మౌళిక వసతుల కల్పనపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశంలో పోలింగ్ సెక్టోరియల్ అధికారుల, పంచాయతీ కార్యదర్శులచే ఎంపీడీఓ జయరాములు సమీక్ష నిర్వహించారు. మండలంలోని 65పోలింగ్‌స్టేషన్లను 7సెక్టర్లుగా విభజించి ఒక్కో సెక్టర్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వారికి సమీక్ష నిర్వహించారు. పోలింగ్ జరిగే రోజూ ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదేశించారు. ఏ సమస్య వచ్చిన మానిటరింగ్ టీంకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు బాబురావు, రాములు, మానిటరింగ్ అధికారిణి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోస్గిలో పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

కోస్గి: పట్టణంలో బహర్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2000-01 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం వారికి బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. 20 ఏళ్ల తరువాత పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఇక్కడి పిలిచి సన్మానించడం అభినందనీయమని అప్పటి హెచ్ఎం ఆంజనేయులు కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులు వేణుగోపాల్, ప్రవీణ్‌కుమార్, కిష్టయ్య, నర్సింహులు విజయ్‌కుమార్, చలం విద్యార్థుల బాగోగులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీకాంత్, రాఘవేందర్, వెంకటస్వామి, రవీందర్, నరేందర్, గౌస్, బాలు, నాగరాజు, వెంకటయ్య, ఆంజనేయులు, హన్మంతు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

కత్తితో గొంతు కోసిన వైనం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘనపురం: ఓ వృద్ధురాలిపై హత్యాయత్నం జరిగిన ఘటన మండలంలోని సోళీపురం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంగనూరు చంద్రమ్మ (60) గురువారం రాత్రి భోజనం ముగించుకొని ఇంటి ఎదుట మంచంపై పడుకుంది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో ఆమె గొంతు కోశారు. శుక్రవారం ఉదయం చిన్న కోడలు లేచి చూడగా చంద్రమ్మ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ కనిపించింది. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిన్న కోడలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు. కాగా వృద్ధురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా తీసుకెళ్లలేదు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే హత్యాయత్నానికి ప్రయత్నించి ఉంటారని అనుమానిస్తున్నారు.

ఉరేసుకుని నవవధువు బలవన్మరణం

భర్త, మరిది వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు, బంధువులు



గాయత్రి(ఫైల్ ఫొటో)

కొత్తకోట రూరల్: పెళ్లైన మూడు నెలలకే భర్త, మరిది వేధింపులు తాళలేక ఓ నవ వధువు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాలకి చెందిన సుజాత, తిరుపతయ్యల కుమార్తె గాయత్రి(19)ని, వనపర్తి మండలం పెద్దగూడెంకి చెందిన బాలకృష్ణకు మార్చి 13న ఇచ్చి వివాహం చేశారు. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో బాలకృష్ణ, గాయత్రితో పాటు బాలకృష్ణ సోదరుడు శ్రీకాంత్ ముగ్గురు కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భర్త, మరిది వేధింపుల కారణంగా వారం రోజుల కిందట గాయత్రి పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి నచ్చజెప్పి భర్తతో గాయత్రిని పంపించారు. ఆ తర్వాత బుధవారం రాత్రి కర్మన్‌ఘాట్‌లోని అద్దె ఇంట్లో గాయత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. గాయత్రి మృతికి భర్త, మరిది శ్రీకాంత్ ఇద్ద రు కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. శుక్రవారం పెద్దగూడెంలో గాయత్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ధన్వాడ: మండలంలోని యాంనోనిపల్లిలో ఎల్లమ్మ ఆలయ నూతనంగా నిర్మించిన సందర్భంగా ఆలయంలో చండీయాగం నిర్వహించి పునఃప్రారంభించారు. కాంగ్రెస్ డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి ప్రారంభోత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు నరహరి, పూజారి యాదప్ప, మల్లేష్, రాములు, బోయ నర్సింహులు, కాశీనాథ్‌రెడ్డి, నాగేష్, రమేష్, శ్రీనివాసులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి



నారాయణపేట: పేదల కడుపు కొట్టి పెట్టుబడి దరలకు మేలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఎంఎల్ మాస్ లైన్ డివిజన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ ఓటర్లను కోరారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా, అశోక్‌నగర్‌లో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌర హక్కులను కాపాడుకోవడం కోసం, పేదలకు ఉపాధి, విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని, నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్‌లైన్ పార్టీటౌన్ కార్యదర్శి కెంచె నారాయణ, మండల కార్యదర్శి బి నర్సింహులు, మైనార్టీ కాలనీ అధ్యక్షులు సాదిక్, నాయకులు లాలూ ప్రసాద్, రఫీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.